ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి పత్రాలను అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

మర్పల్లి, జూన్ 20: ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిష్పక్షపాతంగా సేవలందించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మర్పల్లి మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో మంజూరైన ఇండ్లను వచ్చే ఉగాదినాటికి పూర్తిచేసి గృహప్రవేశాలు నిర్వహించాలన్నారు. స్పీకర్ హోదాలో ఉండడంతో వికారాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఏడు వేల ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని , నియోజకవర్గంలో సొంత ఇల్లు లేని పేదలందరికి ఏడాదికి కొంతమందికి చొప్పున అందరికి ఇండ్లను మంజూరు చేయిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు అందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రజలందరికీ ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉంటూ నిష్పక్షపాతంగా సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మోహన్ కృష్ణ, ఎంపిడిఓ రాజ్ మల్లయ్య, తహసీల్దార్ పురుషోత్తం, హౌసింగ్ డి.ఇ.సయ్యద్ సాజిద్, మార్కెట్ చైర్మన్ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, నాయకులు రాములు యాదవ్, సురేశ్ యాదవ్, రామేశ్వర్, సురేశ్, రాచన్న, గణేష్, లడ్డు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి, జూన్ 20 :పరిగి పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సులను శుక్రవారం పరిగి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వీరేంద్రనాయక్, ఎస్ఐ సంతోష్‌కుమార్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షించడంతోపాటు వాటి పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు.

వికారాబాద్, జూన్ 20: పీఎంజేజేబీవై పథకం కింద లబ్ధిదారురాలికి రూ. 2 లక్షల చెక్కును అందజేసినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శృతి తెలిపారు. వికారాబాద్ లోని ఎంఐజీ కాలనీకి చెందిన అంబానీ శ్రీశైలం ఇటీవల మృతి చెందాడు. అతని భార్య వరలక్ష్మికి పీఎం జేజేబీవై రూ.2 లక్షలు క్లెయిమ్ ను బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శ్రుతి , సీఎఫ్ ఎల్ కౌన్సెలర్లు కలిసి ఇచ్చారు. కార్యక్రమంలో వీఐడీఎస్ స్వచ్ఛంద సంస్థ వికారాబాద్ కౌన్సిలర్స్ ఉదయ్ కుమార్, మాధవి ఉన్నారు.

దశలవారీగా దరఖాస్తులకు పరిష్కారం

పరిగి: రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ ఆనంద్‌రావు

పరిగి, జూన్ 20: పరిగి మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో సుమారు 500 దరఖాస్తులు వచ్చాయని పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు తెలిపారు. శుక్రవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వచ్చిన దరఖాస్తులను దశల వారిగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 15వ తేదీ వరకు దరఖాస్తులన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నా రు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు నవీన్‌రెడ్డి, అనిల్‌బాబు, ఆర్ఐలు దివ్య, కవిత, స్వప్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: ఏర్పుమల్ల గ్రామ రెవెన్యూ పరిధిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 123 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ఇప్పటివరకు మండల పరిధిలో 17 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 548 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు.భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. కార్యక్రమం లో ఆర్ఐ శిరీషా, రెవెన్యూ సిబ్బంది,గ్రామ పెద్దలులు పాల్గొన్నారు.

కులకచర్ల: రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి ఆధ్వర్యంలో భు భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. భూముల సమస్యల పరిష్కారానికి భూభారతి ఉపయోగపడుతున్నదని, భూభారతి కార్యక్రమం ద్వారా రెవిన్యూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గ్రామంలోని రైతుల నుండి దరఖా స్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పద్మావతి

పరిగి, జూన్ 20: ఇటీవల పోగొట్టుకున్న నాలుగు సెల్‌ఫోన్‌లు పోలీసులు రికవరీ చేశారు. పరిగిలో తమ సెల్ ఫోన్‌లు పోగొట్టుకున్న నలుగురు నర్సింహులు(మాదారం), హమీద్ (పరిగి), రమేశ్ (పరిగి), మహిపాల్(గడిసింగాపూర్)లకు సంబంధించిన ఫోన్‌ల సీఐఆర్ ఫోర్టల్ ద్వారా రికవరీ చేసి శుక్రవారం వారికి ఎస్ఐ సంతోష్‌కుమార్ అందజేశారు. ఈ నెలలో మొత్తం 15 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కులకచర్ల, జూన్ 20: అవమాన పరిచేవిధంగా, ఆత్మాభిమానాన్ని దెబ్బతినే విధంగా తనపై రాతలు రాసిన ఆన్‌లైన్ పేపర్ల రిపోర్టర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు శుక్రవారం కులకచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 18న ముజాహిద్ పూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సుకు హాజరు కావాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తనకు ప్రోటోకాల్ ప్రకారం సమాచారం ఇచ్చారని దీనితో సమావేశానికి హాజరయ్యానని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ హోదాలో తాను సమావేశానికి హాజరవుతున్నానని దీనికి గాను కొందరు ఆన్‌లైన్ పేపర్లలో పనిచేస్తున్నామని ఏవోవే రాతలు రాసి తన ఆత్మాభిమానాన్ని దెబ్బతిసేవిధంగా చేశారని ఫిర్యాదులో తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగితాలపైనే కొడంగల్ అభివృద్ధి

కొడంగల్, జూన్ 20: కొడంగల్ అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని, సిరిసిల్లా గజ్వేల్ తరహాలో అభివృద్ధి చెందుతది అనుకుంటే ప్రజలకు నిరాశ మిగిలిందని ఎంఐఎం తాలూకా అధ్యక్షుడు గుల్షన్ పేర్కొన్నారు. శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం ఇలాఖ లో అభివృద్ధి శూన్యంగా మారిందని, కొడంగల్ నుంచి ఎమ్మెల్యే గా గెలుపొందిన రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో కొడంగల్ రూపు రేఖలు మారుతాయనే భావన కలగానే మిగిలేలా ఉందన్నారు. కోట్లాది రూపాయలు అభివృద్ధికి మంజూరు చేస్తున్నామంటున్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని ఆరోపించారు. కొడంగల్‌లోని అంబేద్కర్, వినాయక చౌరస్తాలను విస్తరిస్తమని అంబేడ్కర్ చౌరస్తాలో విస్తరణ చేపట్టకుండా నామ మాత్రపు పనులతో చేతులు దులుపుకున్నట్లు తెలిపారు.అదే విధంగా కొడంగల్ లో శిథిలావస్థకు చేరిన షాదీఖానా నూతనంగా నిర్మిస్తామని నిధులు మంజూరైనట్లు ప్రొసీడింగ్ చూపించడమే కానీ ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. హామీలు ఇవ్వడం, విస్మరిం చడం రేవంత్‌రెడ్డి కి పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ పై ప్రత్యేక చొరవతో సిరిసిల్ల, గజ్వేల్ తరహా అభివృద్ధిని చేపట్టి చిత్త శుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు.

అడ్మిషన్లను మరింతగా పెంచాలి

అధ్యాపకుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్

పరిగి, జూన్ 20 : పరిగి పట్టణం తుంకులగడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్య , స్కాలర్ షిప్‌లు వంటి సదుపాయాలను విద్యార్థులకు తెలియజేయాలని, తద్వారా అడ్మిషన్లను మరింతగా పెంచాలని సూచించారు. నీట్, ఐఐటీ పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, అధ్యాపకులు రాజ్ కుమార్యా, భాస్కరయోగి , సతీష్ వర స్వామి, గోపాల్, ప్రభాకర్ , రవి , వెంకటేశ్, గణేశ్, బాలగణేశ్ , మమత తదితరులు పాల్గొన్నారు.

టీబీని నిర్లక్ష్యం చేయవద్దు

కొడంగల్, జూన్ 20: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు డా. బుష్రా పేర్కొన్నారు. శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ లోని వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని వడ్డర్ గల్లీవీధి లో టీబీ, షుగర్, బీపీ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి అధిక దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రుల్లో చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. శుక్రవారం నిర్వహించిన వైద్య క్యాంపులో మొత్తం 110 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 30 మందిని గుర్తించి తెమడా, ఎక్సరే పరీక్షలు చేసినట్లు తెలిపారు. వీరిలో వ్యాధి నిర్ధారణ జరిగితే వారికీ ఆరు నెలల పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు పౌష్టికాహారం నిమిత్తం నగదును కూడా అందించడం జరుగుతుందన్నారు. కావున నిర్లక్ష్యం చేయకుండా విధిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి డా. అమృత, హెల్త్ ఆసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి, టీబీ సూపర్ వైసర్ రాహత్ అలీ, ఏఎన్ఎం చంద్రకళ తోపాటు ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేయాలి

బొంరాస్‌పేట, జూన్ 20 : మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాల హెచ్ఎంలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యాధికారి హరిలాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కొత్త విద్యార్థుల చేరిక, విద్యార్థుల ప్రోగ్రెస్, యాక్టివిటీస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు యూని ఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, హాజరు వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యుల్, యోగడే తదితర అంశాల పై సమావేశం జరిగింది. మండలంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకా రం ఫీజులు వసూలు చేయాలని పాఠ్య పుస్తకాలు,స్కూల్ యూనిఫామ్‌లను అధిక ధరలకు విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ సోమ్లా నాయక్, శంకరయ్య, గౌస్, ఖలీల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ

బొంరాస్ పేట, జూన్ 20 : మండల పరిధిలోని మెట్లకుంట,కొత్తూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లకు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఎంపీడీవో వెంకన్ గౌడ్ భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నాణ్యతతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం త్వరగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు విడుదలవారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహులు గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, రామచంద్రారెడ్డి, మల్లికార్జున్, కిష్టప్ప,రవి గౌడ్, రాములు, భీమ్రావు, ప్రవీణ్, మహేందర్, భీమ్‌రెడ్డి, కార్యదర్శి సిద్దు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి

హయత్‌నగర్, జూన్ 20 : విధులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం... అబ్దుల్లాపూర్ మెట్ మండలం, మునగనూరు గ్రామానికి చెందిన రమావత్ మాన్ సింగ్(45), పీసీ -2020 బ్యాచ్ యాదాద్రి ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మాన్‌సింగ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై మునగనూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలో పసుమాముల సర్వీస్ రోడ్డుపై బ్రేక్‌డౌన్‌తో నిలిచిపోయిన టిప్పర్ వాహనాన్ని వెనుక నుంచి బైక్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ మాన్‌సింగ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మాన్ సింగ్ మృతి పట్ల గ్రామస్తులు, తోటి ఉద్యోగులు సంతాపం వెలిబుచ్చారు.

రమావత్ మాన్‌సింగ్(ఫైల్)

నగరంలో డ్రగ్స్ దందా.. ముగ్గురి అరెస్టు

రూ. 1.75 లక్షల విలువజేసే ఎండీఎంఏ పట్టివేత

సిటీబ్యూరో, జూన్ 20 (నమస్తే తెలంగాణ): బెంగళూరు కేంద్రంగా నగరంలో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరితోపాటు డ్రగ్స్ సరఫరా చేస్తున్న మరొకరిని ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.75లక్షల విలువజేసే 22.08 గ్రాముల ఎండీఎంఏ, 6.06 గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ ప్రదీప్‌రావు కథనం ప్రకారం... బెంగళూరుకు చెందిన నీరజ్‌కుమార్ స్థానికంగా తక్కువ ధరలో డ్రగ్స్ కొనుగోలు చేసి నగరంలోని వ్యాపారులకు అధిక ధరతో విక్రయిస్తాడు. శుక్రవారం బెంగళూరు నుంచి నగరానికి వచ్చిన నీరజ్‌కుమార్ డ్రగ్స్ విక్రయ దారులైన వినోద్‌కుమార్, బాలాజీ అనే వ్యక్తులకు డ్రగ్స్ అందజేస్తుండగా.. సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్-బి ఎస్సై సంధ్య తన సిబ్బందితో కలిసి నేరేడుమెట్ మెయిన్ రోడ్డుపై ముగ్గురు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.75లక్షల విలువజేసే 22.08గ్రాముల ఎండీఎంఏ, 6.06గ్రాముల ఓజి కుష్‌తో పాటు మూడు సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

నక్షత్ర తాబేళ్లు విక్రేతపై కేసు

శేరిలింగంపల్లి, జూన్ 20: నక్షత్ర తాబేళ్లు విక్రయించేందుకు యత్నించిన ఒకరిని అరెస్టు చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మణికొండ సాయిరాంనగర్ ప్రాంతంలోని న్యూ బ్లే స్టార్క్ అక్వేరం షాపు నిర్వహించే చెరుకుల బాలస్వామి(40) నక్షత్ర తాబేళ్లు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఓటీ, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నిందితుడి నుంచి నాలుగు నక్షత్ర తాబేళ్లు, రెండు రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి అతడి స్నేహితుడు సురేశ్‌కుమార్ చెన్నై నుంచి తాబేళ్లను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు బాలస్వామికి నోటీసు జారీ చేస్తామని, తాబేళ్లను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు పేర్కొన్నారు. మరో నిందితుడు సురేశ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. కేసు ఫారెస్ట్ విభాగానికి బదిలీ చేస్తామన్నారు.

గవర్నర్‌ను కలువాలంటూ మహిళ హల్‌చల్

గంట సేపు రాజ్‌భవన్ ముందు బైఠాయించి కన్నీటి పర్యంతం

పంజాగుట్ట పీఎస్‌కు తరలించిన పోలీసులు

ఖైరతాబాద్, జూన్ 20: రాజ్ భవన్ ముందు ఓ మహిళ హల్‌చల్ చేసింది. కార్యాలయం ముందు బైఠాయించి తాను గవర్నర్‌ను కలువాలంటూ పట్టుబట్టిన ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్ వద్దకు ఓ గుర్తుతెలియని మహిళ చేరుకొని లోనికి వెళ్లేందుకు ప్రయత్నించింది. సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో వారిని వారిస్తూ గవర్నర్‌ను కల్పించాలంటూ ప్రాధేయపడింది. వారు ఒప్పుకోకపోవడంతో అక్కడే బైఠాయించి కన్నీటి పర్యంతమైంది. పోలీసులు ఆమెను వివరాలు అడిగినా సరైన సమాధానం చెప్పకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ పోలీసులు ఆమెను విచారించగా, తనకు ముంబైలో ఇల్లు ఉందని, గతేడాది తన ఇంట్లో సుమారు రూ.40లక్షల వరకు దొంగతనం జరిగిందని, అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో బొల్లారానికి వచ్చి ఇక్కడ ఇంట్లో నివాసం ఉంటున్నానని, ఇక్కడి పోలీసులకు ఫిర్యాదు చేస్తే స్వీకరించడం లేదన్నారు. గవర్నర్‌కైనా చెప్పుకుందామని రాజ్ భవన్‌కు వచ్చానని, తనను ఎలాగైనా కల్పించాలని ఆమె ప్రాధేయపడింది. విచారణలో బొల్లారంలోని రిసాలబజార్‌లో నివాసం ఉండే నాగమణిగా పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తుండటంతో పూర్తి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులకు పరీక్షగా మారింది. తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజ్ భవన్ ఎదుట బైఠాయించిన నాగమణి

నకిలీ ఐడీ కార్డులతో ఆర్మీ సెంటర్‌లోకి..

పోలీసుల అదుపులో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు

బొల్లారం, జూన్ 20: తిరుమలగిరి మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్(ఎంసీఈఎంఈ) సెంటర్‌లోకి అక్రమంగా నలుగురు ప్రవేశించిన సంఘటన శుక్రవారం తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తిరుమలగిరిలోని ఎంసీఈఎంఈలో అక్రమంగా ఇద్దరు మహిళలు బుర్ఖా ధరించి.. ఇద్దరు పురుషులు అక్రమంగా ప్రవేశించి వీడియోలు తీస్తున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జవాన్లు ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధమని వారిని అడ్డుకున్నారు. కాగా, నిం దితులు 'మేము ఆర్మీ జవాన్లమే' అంటూ ఐడీ కార్డులు చూపించారు. దీంతో స్థానిక జవాన్లు వారు ఐడీ కార్డులను పరిశీలించి ఆర్మీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఐడీ కార్డులను పరిశీలించిన అధికారులు అవి నకిలీ ఐడీ కార్డులు అని గుర్తించి వెంటనే తిరుమలగిరి పోలీసులకు సమాచా రం అందించారు. ఆర్మీ సెంటర్‌లోకి నకిలీ ఐడీ కార్డులతో ప్రవేశించిన వారు ఎక్కడి నుంచి వచ్చారని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రైళ్లలో చైన్‌స్నాచింగ్.. ఇద్దరి నిందితుల అరెస్టు

రూ.2.98లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

మారేడ్‌పల్లి, జూన్ 20: రైళ్లలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.2,98,000 విలువజేసే 29.8 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను రైల్వే డీఎస్పీ జావెద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లాకు చెందిన అభయ్ రాజ్ సింగ్(28), అదే ప్రాంతానికి చెందిన మిథిలేష్ గిరి(20) వీరిద్దరూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు స్నేహితులు కావడంతో నిత్యం మద్యం సేవించడం, జూదం, ధూమపానం చెడు అలవాట్లకు బానిసయ్యారు. వీరికి వచ్చే డబ్బులు సరిపోక దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడటంతో అభయ్ రాజ్‌సింగ్ గతంలో జైలు జీవితం గడిపి బెయిల్‌పై వచ్చాడు. వచ్చిన తరువాత కూడా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో స్నేహితుడైన మిథిలేష్ గిరితో కలిసి సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు రైళ్లలో(4 కేసుల్లో) చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. శుక్రవారం వీరిద్దరు నిందితులు రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదస్థితిలో తిరుగుతుండగా.. రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను అంగీకరించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే పోలీసు సిబ్బందిని రైల్వే డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్

కార్డెన్ సెర్చ్ .. 300 ఇండ్లు తనిఖీ

మెహిదీపట్నం, జూన్ 20: టోలిచౌకి పారా మౌంట్ కాలనీలో శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు పోలీసులు పెద్దఎత్తున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గత కొన్ని రోజులుగా విదేశీ యుల (నైజీరియన్లు, సోమాలియన్లు) కారణంగా పారామౌంట్ కాలనీలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయంటూ ఫిర్యాదులు వచ్చా యి. దీంతో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలతో దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 300 ఇండ్లను పోలీసులు తనిఖీ చేశారు.

పరిగి, జూన్ 20: పరిగి మండలం సయ్యద్ పల్లి సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీ ని ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్ఓటీ పోలీసులు సీజ్ చేసిన వాహనాలను పరిగి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పరిగి పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

అర్జెంట్‌గా కావలెను

★అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను.
మంచి జీతం కలదు @ కోహెడ ఫ్రూట్ మార్కెట్‌లో & షాద్‌నగర్ ప్రాంతాల్లో.
సంప్ర: 9392663777, 9246663777.
NT-347056

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS

పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్